సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం | 29 | డిసెంబర్ | 2023



ల్యాబ్, ఐ బ్యాంక్‌కు రూ.3 లక్షలు


బాలాజీచెరువు (కాకినాడ): బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌కు రూ.2 లక్షలు, ఐ బ్యాంక్‌కు రూ.లక్ష చొప్పున ఆయన తనయుడు డాక్టర్ రాధా దామోదర్ విరాళం అందజేశారు.



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవనానికి కాశీ విశ్వనాథ రవికుమార్ దంపతులు (రావులపాలెం) గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

డెల్టాలకు 12,300 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు గురువారం 12,300 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు 3,800, సెంట్రల్ 2,500, పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

ప్రజాభాగస్వామ్యం ఉండాలి



మాట్లాడుతున్న కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ డైరెక్టర్ శోభిత్ గుప్తా, కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా అధికారులు చొరవ చూపాలని పాఠశాల విద్య, అక్షరాస్యత, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ డైరెక్టర్ శోభిత్‌గుప్తా, కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులకు సూచించారు. కోనసీమ జిల్లాలో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై గురువారం కలెక్టరేట్‌లో వారు అధికారులతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లా జనాభా 8,13,153గా ఉండగా 196 గ్రామ పంచాయతీలలో ఇప్పటివరకు సంకల్పయాత్ర నిర్వహించామన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందుతున్న వారి సంఖ్య 4,70,287గా ఉందని వీరి శాతం 57.83 శాతంగా ఉందన్నారు. జనవరి 26 నాటికి ముగియనున్న వికసిత్ భారత సంకల్ప యాత్ర విజయవంతం అయ్యేవిధంగా 25 శాతం నుంచి 30శాతం స్థానిక ప్రజలు మమేకమయ్యే విధంగా అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి వి.కృష్ణకుమారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్‌ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్ రావు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో వేగంగా ఆరోగ్య సేవలు



డాక్టర్ మానస సుప్రియను వివరాలు అడుగుతున్న డీఎం హెచ్ఓ దుర్గారావు దొర

రాజోలు: క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవలు వేగంగా అమలు జరుగుతున్నాయని డీఎం అండ్ హెచ్ఓ ఎం.దుర్గారావు దొర అన్నారు. గురువారం ఆయన పొదలాడ గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుల పంపిణీ, బాలింతలు, గర్భిణుల, చిన్నారుల వివరాలను త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలని సిబ్బందికి సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు సంబంధించిన రికార్డుల వివరాలను డాక్టర్ మానస సుప్రియను అడిగి తెలుసుకున్నారు. ఎంపీహెచ్ఈఓలు కె.త్రినాథరావు, ఆర్.రామకృష్ణారావు, హెచ్‌వీ బి.జయకుమారి, టీబీ యూనిట్ సూపర్‌వైజర్లు జి.సర్వారాయుడు, యు.హరిప్రసాద్, ఏఎన్ఎంలు వి.సునీత, ఆర్.కుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అయినవిల్లి విఘ్నేశ్వరుని హుండీ ఆదాయం రూ.14,96,442



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అలయ సిబ్బంది

అయినవిల్లి: విఘ్నేశ్వరుని హుండీ ఆదాయాన్ని ఆలయ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో గురువారం లెక్కించారు. 35 రోజులకు రూ.14,96,442 లభించిందని ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 27.5 గ్రాముల బంగారం, 901 గ్రాముల వెండి లభించిందని తెలిపారు.

నేటి నుంచి ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

రాజమహేంద్రవరం రూరల్: ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు శుక్ర, శనివారాల్లో నిర్వహిస్తున్నారు. డీఆర్ఓ జి.నరసింహులు తెలిపారు. ఈ పరీక్షలు, విద్యా శాఖ ద్వారా పశు సంవర్ధక శాఖ పోస్టుల భర్తీ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన గురువారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆబ్జెక్టివ్, కన్వెన్షనల్ విధానంలో పరీక్షలు జరుగుతాయన్నారు. నగరంలోని రాజీవ్ గాంధీ విద్యా సంస్థల్లో ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు. ఆబ్జెక్టివ్ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకూ, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. శుక్రవారం ఉదయం 258 మంది, మధ్యాహ్నం 211 మంది, శనివారం ఉదయం 440 మంది, మధ్యాహ్నం 116 మంది చొప్పున ఈ పరీక్షలకు హాజరవుతారని అధికారులు తెలిపారు.

సుస్తీతో కుస్తీ

- పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం మరింత శ్రద్ధ
- ప్రజల ముంగిటకే వైద్యం
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలలో పరీక్షలు
- అందరికీ అందుబాటులో ఫ్యామిలీ డాక్టర్
- రోగమొస్తే చికిత్స చేయించుకునేందుకు రూ.25 లక్షల హెల్త్ కార్డు చేతిలో..
- ఆరోగ్యశ్రీ సేవలు, చెల్లించే మొత్తాల పెంపు ఈ ఏడాదిలోనే

జిల్లా గణాంకాలు

కంటి వెలుగు లబ్ధిదారులు	47,080
కంటి వెలుగులో క్యాటరాక్ట్ కేసులు గుర్తించినవి	1967
కంటి వెలుగులో కళ్ల జోళ్లకు సిఫారసు చేసినవి	32,166
రక్త పోటు (బీపీ) ఉన్న వారిని గుర్తించిన కేసులు	7,965
సుగర్ వ్యాధి ఉన్న వారిని గుర్తించిన కేసులు	5,478
రిఫరల్ రోగులు	2,130





ముమ్మిడివరం మండలం అనాతవరంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం వరుసగా ఆరోగ్య వరాలు ఇచ్చి పేద ప్రజల వైద్యానికి మరింత భరోసాగా నిలిచింది. దీంతో పేద ప్రజల్లో ఆరోగ్య ధీమా బలపడింది. జగనన్న ఆరోగ్య సురక్ష విధానంతో ప్రజలకు వైద్యాన్ని చేరువ చేయడమే కాకుండా వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకంలో ఇప్పటికే ఉన్న 1,059 వైద్య సేవలను (రోగాలను) 3,257కి ఒకేసారి విస్తరించారు. అంతేకాదు ఎవరైనా రోగి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యానికి వెళితే చికిత్స నిమిత్తం ఇచ్చే మొత్తాన్ని రూ.25 లక్షల వరకూ పెంచారు. గతంలో ఇది రూ.ఐదు లక్షలు ఉండేది. కొత్త ఫీచర్స్‌తో జిల్లాలోని అర్హులైన ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతోంది. ఇప్పటికే అమలులో ఉన్న ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు తాము నివసిస్తున్న ఊళ్లోనే వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఆరోగ్య నామ సంవత్సరంగా పేరు పెట్టినట్లు వైద్య పరంగా వరుస వరాలు రావడంతో జిల్లా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో 455 శిబిరాల నిర్వహణ

ఈ ఏడాదిలో నవంబర్ ఒకటి నుంచి మొదలై దాదాపు 40 రోజుల పాటు అమలైన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా జిల్లాలో మొత్తం 455 వైద్య శిబిరాలను నిర్వహించారు. బీపీ, సుగర్‌తోపాటు కంటి చూపు మందగిస్తున్న వారికి పరీక్షలు చేసి ఈ పథకం ద్వారా కంటి వెలుగును కూడా అందించారు.

5,32,517 ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు

విస్తరించిన ఆరోగ్యశ్రీ సేవలతో రూపొందించిన కొత్త ఫీచర్లతో జిల్లాలో 5,32,517 మంది అర్హులకు స్మార్ట్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాల్లో 18 ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా ఈ ఏడాది 29 వేల మందికి వివిధ రోగాల కింద ఉచిత వైద్య సేవలు అందాయి. సుమారు రూ.58 కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ద్వారా జిల్లాలోని రోగులకు వెచ్చించింది.

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ ఇలా..

వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్	432
గర్భవతులు	10,418
బాలింతలు	3,455
రక్త పోటు పరీక్షలు	72,419
సుగర్ పరీక్షలు	28,929
రక్తపోటు, సుగర్ రోగుల మొత్తం సంఖ్య	66,899



అమలాపురం కిమ్స్ ఆస్పత్రి ఐసీయూలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్న రోగులు

నాకు కంటి చూపు వచ్చింది



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా నాలాంటి కంటి రోగులకు ఎందరికో చికిత్స అందింది. ఈ కార్యక్రమం ద్వారా నా కంటి ఆపరేషన్ చేయించుకున్నాను. ఇప్పుడు నా కంటి చూపు పూర్తిగా బాగుంది. అదే ఆపరేషన్ డబ్బు పెట్టి చేయించుకుంటే నాకు భారమే. ప్రభుత్వమే ఉచితంగా చేయించింది.

– కట్టా వీర వెంకట సత్యనారాయణ, సూర్యనగర్, అమలాపురం

ఫ్యామిలీ డాక్టర్ వైద్య పరీక్షలు చేస్తున్నారు



కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నాకు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానం మేలు చేస్తోంది. నాకు తరుచూ డాక్టర్ పరీక్షలు చేస్తూ నా వ్యాధిపై ఆరా తీస్తున్నారు. ఎస్.యానాం పీహెచ్‌సీ నుంచి ఫ్యామిలీ డాక్టర్ నాకు వైద్యం చేస్తున్నారు. డాక్టర్ క్రమం తప్పకుండా నాతో మందులు వాడిస్తున్నారు. నాలాంటి దీర్ఘ కాలిక రోగులకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అండగా ఉంది.

–కొల్లు భీమారావు, చల్లపల్లి, ఉప్పలగుప్తం మండలం

ఆరోగ్యశ్రీయే ఆదుకుంది



నాది పేద కుటుంబం. ట్యూషన్లు చెప్పుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వాణ్ణి. ప్రశాంతంగా ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నాకు ఓ రోజు గుండెలో తేడాగా ఉంటే వైద్యునికి చూపించాను. స్టంట్‌లు పడతాయన్నారు. గత సంవత్సరంలో ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.82 వేల వ్యయమయ్యే రెండు స్టంట్‌లు వేశారు. ఆరోగ్యశ్రీయే నన్ను ఆదుకుంది.

– గన్నవరపు అప్పారావు, అమలాపురం

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఆరంభం



పి.గన్నవరం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కమలకుమారి

రాయవరం: ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను పెంచుకునేందుకు ఉద్దేశించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ప్రతి నెలా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో పాటుగా, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహిస్తున్న విషయం పాఠకులకు విదితమే. నెల వారీ సమావేశాల్లో భాగంగా డిసెంబర్ నెలకు సంబంధించిన సమావేశాలు నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో 50 శాతం మంది ఉపాధ్యాయులు పాల్గొనగా, సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాల్లో భాగంగా తెలుగు, గణితం, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టు ఉపాధ్యాయులకు సమావేశాలను నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 22 మండలాల్లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు 39 స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. సబ్జెక్టు కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు 48 స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. శుక్రవారం 39 ప్రాథమిక పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలు, ఇంగ్లిషు, హిందీ, సోషల్ సబ్జెక్టు ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నారు. జగనన్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం కారణంగా వ్యాయామ ఉపాధ్యాయులకు నిర్వహించాల్సిన నియోజకవర్గానికి ఒక స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఈ నెల రద్దు చేశారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి, రామచంద్రపురం డీవైఈవో శ్రీపాద లక్ష్మీనరసింహఫణి, సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు, ఎంఈవోలు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సందర్శించి, నివేదికలను ఆన్‌లైన్‌లో సమర్పించారు.

కొత్త ఏడాది పెన్షన్ రూ.3 వేలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శుక్లా, ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు

సాక్షి అమలాపురం: కొత్త సంవత్సరం నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.మూడు వేల చొప్పున అందించనున్నామని, రూ.2,750 ఉన్న పెన్షన్‌ను ప్రభుత్వం పెంచిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలను అమలులో సన్నద్ధతపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లాతోపాటు కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పాల్గొన్నారు. జిల్లాలో ఆయా పథకాల గురించి కలెక్టర్ శుక్లా సీఎం జగన్‌కు వివరించారు. అనంతరం స్థానిక అధికారులను ఉద్దేశించి కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ వచ్చే నెల ఒకటి నుంచి 8వ తేదీ వరకు పెన్షన్ల పంపిణీ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా జరుగుతుందన్నారు. మండలాలలో పెంచిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఏ రోజు జరుగుతుందో వలంటీర్లు లబ్ధిదారులకు తెలియజేస్తారన్నారు. ప్రతి నెలా 2,44,463 మంది పెన్షన్లు అందుకుంటున్నారని, తాజాగా 2,779 మంది పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రతి నెలా జిల్లాలో సుమారు రూ.66 కోట్లు పెన్షన్లకు ఖర్చు చేస్తున్నామని కలెక్టర్ శుక్లా తెలిపారు. వైఎస్సార్ ఆసరా (నాలుగో విడత) కార్యక్రమాన్ని 2024 జనవరి 23న రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మూడు విడతలలో 31,043 సంఘాలకు రూ.761.83 కోట్లు జమ చేశామన్నారు. 45 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు సంవత్సరానికి రూ.18,750 చొప్పున నాలుగు సంవత్సరాలలో రూ.75 వేలు అందించే వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమం రానున్న ఫిబ్రవరి 5 నుంచి 14 వరకు ప్రతి మండలంలో జరుగుతుందన్నారు. గడిచిన మూడేళ్లలో జిల్లాలో 89,174 మంది లబ్ధిదారులకు వైయస్సార్ చేయూత కింద సుమారు రూ.481 కోట్లు పంపిణీ చేశామని పేర్కొన్నారు. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, హితకారిణి సమాజం చైర్మన్ కాశీ బాల ముని కుమారి, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకర్ పాల్గొన్నారు.

రత్నగిరిపై కొనసాగుతున్న భక్తుల తాకిడి



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరికి భక్తుల తాకిడి కొనసాగుతోంది. గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ వేలాదిగా భక్తులు సత్యదేవుని సన్నిధికి తండోపతండోపాలుగా తరలి వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూ లైన్లు అన్నీ భక్తులతో నిండిపోయాయి. వారి వాహనాలతో పార్కింగ్ స్థలం కూడా నిండిపోయింది. సాయంత్రం నాలుగు గంటల వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. సత్యదేవుని సుమారు 30 వేల మంది భక్తులు దర్శించారు. వ్రతాలు 2,200 జరిగాయి. స్వామివారి నిత్య కల్యాణాలు 30 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరిందని దేవస్థానం అధికారులు తెలిపారు.

విద్యాదీవెన.. భవితకు నిచ్చెన

- పేదల పెద్ద చదువులకు భరోసా
- నేడు జగనన్న విద్యాదీవెన నిధుల విడుదల
- జిల్లాలో 28,219 మందికి లబ్ధి
- 25,763 తల్లుల ఖాతాల్లో రూ.21.24 కోట్లు జమ



విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన స్కాలర్ షిప్ చెక్కును అందిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా (ఫైల్)

రాయవరం: విద్యతోనే పేదల బతుకులు మారతాయని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరచుగా చెబుతున్న మాట. రాష్ట్రంలో విద్యా విప్లవాన్ని తీసుకొచ్చిన ముఖ్యమంత్రి జగన్ పేదల చదువుకు పేదరికం అడ్డుగోడగా ఉండకూడదనే సదుద్దేశంతో 'జగనన్న విద్యాదీవెన' పథకాన్ని సమర్థంగా అమలు చేస్తున్నారు. పేద విద్యార్థులు నిశ్చింతగా చదువుకునేందుకు వీలుగా ఠంచనుగా కళాశాల ఫీజులను తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ పథకం ద్వారా ఇంటర్ తర్వాత పై చదువులు చదివే విద్యార్థులకు ఆర్థికంగా సాయం అందిస్తున్నారు.

ప్రతి త్రైమాసికానికి చెల్లింపు

పాలిటెక్నిక్, డిగ్రీ, ఎంబీబీఎస్, బీటెక్, ఎంటెక్, బీ.ఫార్మసీ, ఎంబీఏ, ఎం.ఫార్మసీ తదితర ఉన్నత కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ (జగనన్న విద్యాదీవెన) అందిస్తున్నారు. విద్యా సంవత్సరంలో ప్రతీ త్రైమాసికానికి సంబంధించిన కళాశాలల ఫీజులు ఆ త్రైమాసికంలోనే చెల్లిస్తుండడంతో పేద విద్యార్థులు చదువులు సాఫీగా సాగుతున్నాయి. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి నాల్గవ విడత జగనన్న విద్యాదీవెన సొమ్మును శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భీమవరం బహిరంగ సభలో కంప్యూటర్ బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు. జిల్లాలో 28,219 మంది తల్లుల ఖాతాలకు రూ.21,24,96,686 తల్లుల ఖాతాల్లో జమ కానున్నాయి.

గత ప్రభుత్వంలో అస్తవ్యస్తం

గత టీడీపీ పాలనలో ఫీజుల పథకం గాలిలో దీపంలా మారిందనే విమర్శలున్నాయి. నాటి ప్రభుత్వం కళాశాలలకు ఫీజులను సక్రమంగా చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురయ్యేవారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో ఫీజుల కష్టాలు వెంటాడేవి. కళాశాల యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేగాని హాల్ టిక్కెట్లు ఇచ్చేవి కాదు. ఇలా పేద విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొనేవారన్న విమర్శలుండేవి.

చిరునవ్వులతో చదువులు

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక విద్యారంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేశారు. దేశం యావత్తు అబ్బురపడేలా విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. ఫలితంగా ఇప్పుడు విద్యార్థులు నిశ్చింతగా..చిరునవ్వులతో చదువులు సాగిస్తున్నారు. సరస్వతీ పుత్రులుగా మారి..విద్యావేత్తలుగా ఎదుగుతూ కుటుంబానికి, సమాజానికి గర్వకారణంగా నిలుస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో అమలు చేస్తున్న పథకాల పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా లబ్ధి ఇలా..

కులం	విద్యార్థులు	తల్లులు	నిధుల విడుదల
ఎస్సీ	9,568	8,617	రూ.7,04,40,994
ఎస్టీ	137	123	రూ.7,47,575
బీసీ	10,134	9,303	రూ.7,25,70,482
ఈబీసీ	1,842	1,737	రూ.1,70,54,296
ముస్లిం మైనార్టీ	239	226	రూ.20,54,059
కాపు	6,176	5,689	రూ.4,86,32,732
క్రిస్టియన్ మైనార్టీ	123	113	రూ.9,96,548

ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది

జగనన్న విద్యాదీవెన పథకం ఆర్థికంగా వెనుకబాటు కలిగి, ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థులకు బాసటగా నిలుస్తుంది. జవాబుదారీతనంగా ఉండేందుకే తల్లుల ఖాతాల్లో నగదును ప్రభుత్వం జమ చేస్తోంది. వేలాది మంది పేద విద్యార్థులకు పథకం ప్రయోజనకరంగా నిలుస్తుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుంది.

– జ్యోతిలక్ష్మీదేవి, డీడీ, సాంఘిక సంక్షేమ శాఖ, అమలాపురం

అన్ని రంగాలనూ శాసించేది కంప్యూటర్ సైన్సే

జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ ప్రసాదరాజు



సదస్సులో మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కంప్యూటర్ సైన్స్ అన్ని రంగాలనూ శాసిస్తుందని జేఎన్‌టీయూకే ఉపకులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. దివంగత రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ సంస్మరణార్థం జేఎన్‌టీయూలో కంప్యూటర్ విజన్ హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ స్మార్ట్ డివైజెస్ అండ్ నెట్‌వర్క్ అనే అంశంపై గురువారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ, వినూత్న రంగాలకు మూలబిందువుగా కంప్యూటర్ సైన్స్ నిలుస్తుందని అన్నారు. ఇటువంటి సదస్సుల ద్వారా విద్యార్థులకు నూతన ఆలోచనలు కలుగుతాయన్నారు. వాల్టైన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రఘు కొర్రపాటి మాట్లాడుతూ, బీటెక్ స్థాయి నుంచే నాణ్యమైన ఆవిష్కరణల దిశగా సాగాలని సూచించారు. రిజిస్ట్రార్ సుమలత మాట్లాడుతూ, ప్రొఫెసర్ సత్యనారాయణ సేవలు మరువలేనివన్నారు. పరిశోధక విద్యార్థులకు ఏఐ డ్రివెన్ డిఫెక్ట్ ప్రెడిక్షన్ పేవింగ్ ద పాత్ స్టయినబుల్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ అనే అంశంపై డాక్టర్ కనేస్‌రాజ్ అవగాహన కల్పించారు. సదస్సులో ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, డైరెక్టర్లు బాలకృష్ణ, కృష్ణమోహన్, సదస్సు కన్వీనర్ హరిత, సీఎస్ఈ హెడ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

30న 'నన్నయ'లో చిరుధాన్యాలపై వర్క్‌షాప్



బ్రోచర్‌ని విడుదల చేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'మిలెట్స్ ఫర్ హెల్త్ అండ్ ఎంట్రప్రెన్యూర్ షిప్' అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను గురువారం విడుదల చేశారు. 'ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిలెట్స్ – 2023' సందర్భంగా గోదావరి రీజనల్ క్లస్టర్ గ్రూప్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ సహకారంతో ఈ వర్క్‌షాప్ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి జయనిర్మల పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో రుణాలు



డీసీసీబీ మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ ఆకుల వీర్రాజు



మహాజన సభలో పాల్గొన్న సహకార సంఘ అధ్యక్షులు, సీఈఓలు

డీసీసీబీ చైర్మన్ ఆకుల

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రైతులకు కావాల్సిన అన్నీ రుణాలు సహకార సంఘాల ద్వారా సకాలంలో అందిస్తున్నామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. కాకినాడలో గురువారం ఒక ఫంక్షన్ హాల్‌లో డీసీసీబీ 127వ మహా జనసభ నిర్వహించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులకు రూ.353 కోట్ల పంట రుణాలు, రబీలో ఇప్పటి వరకూ రూ.79 కోట్లు ఇచ్చామన్నారు. దీర్ఘకాలిక రుణాలు రూ.985 కోట్లు అందజేసినట్టు తెలిపారు. రైతులకు తక్కువ వడ్డీకి బంగారు నగల తాకట్టుపై రూ.536 కోట్లు, చేనేత, సహకార సంఘాలకు రూ.17.88 కోట్లు రుణాలుగా ఇచ్చామన్నారు. చేనేత సభ్యులకు ముద్రా రుణాల కింద 70.50 లక్షలు ఇచ్చినట్టు చెప్పారు. జగనన్న పాలవెల్లువ పథకంలో గేదెలు కొనుగోలు చేసే కొనేందుకు రైతులకు రూ. 280 కోట్ల రుణాలు పంపిణీ చేశామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా వ్యవసాయ పరికరాలు ఏర్పాటు చేసుకొనేందుకు రైతు గ్రూపులకు రూ.7.98 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. జగనన్న తోడు పథకంలో చిరు వ్యాపారులకు రూ.1.70 కోట్లు ఇచ్చామన్నారు. రైతుల పిల్లలు చదువుకొనేందుకు విద్యా రుణాలు ఇస్తున్నామన్నారు. రైతు నేస్తం పథకం ద్వారా స్వంత భూమి ఉన్న రైతుకు ఎకరానికి రూ.8 లక్షల వరకూ రుణం ఇస్తామన్నారు. ఈ ఏడాది ప్రారంభించిన పథకంలో ఇప్పటికే రూ.103 కోట్లు రుణాలుగా ఇచ్చామన్నారు. బ్యాంకు వార్షిక నివేదికను డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహారావు సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు సహకార సంఘ అధ్యక్షులు రైతు నేస్తం పథకంలో రుణం రైతులకు ఎంతో ఉపయోగపడుతోందని, కానీ షేరు క్యాపిటల్ కింద సుమారు రూ.లక్ష బ్యాంకులో ఉండిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పథకంలో షేర్ క్యాపిటల్ తగ్గించే విధంగా చూడాలని కోరారు. ఈ సమావేశంలో డీసీసీబీ పాలక వర్గ సభ్యులు పులి మధుసుధాకర్‌బాబు, సయ్యద్ మోహిద్దీన్ , బండారు సత్తిరాజు, ఇళ్ల సత్యగోపాలకృష్ణ, టి.శ్రీనివాసరావు, పోలిశెట్టి సోమరాజు, ఆప్కాబ్ నోడల్ ఆఫీసర్ కృష్ణారావు పాల్గొన్నారు.

ఈసారి గెలిచేది వైఎస్సార్ సీపీయే..

- ఎమ్మెల్యే రాపాక
- వచ్చే నెల 5న రాజోలులో బస్సు యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: గత రెండు పర్యాయాలు రాజోలు నియోజకవర్గంలో ఓటమి చెందామని, ఈసారి భారీ మెజారిటీతో ఇక్కడ గెలిచేది వైఎస్సార్ సీపీయేనని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కత్తిమండ గ్రామం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వచ్చే నెల 5వ తేదీన రాజోలు నియోజకవర్గంలో జరుగనున్న వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్సు యాత్రను విజయవంతం చేయడాన్ని ప్రతి కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పేర్కొన్నారు. మొక్కుబడి కార్యక్రమాలకు స్వస్తి చెప్పి వచ్చే ఎన్నికలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని సూచించారు. గతంలో రోడ్లు వేయలేదనే ప్రతిపక్షాలు విమర్శించేవి తప్ప మరొకటి లేదని, అయితే ప్రస్తుతం నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో రోడ్ల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ప్రతిపక్షాలకు దీటుగా సమాధానం ఇవ్వాలని సూచించారు. వచ్చే ఎన్నికలలో విజయం సాధించి జగన్ మరొకసారి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మరింతగా అభివృద్ధి పథంలో సాగుతుందన్నారు. ప్రతిపక్షాలకు అవకాశం ఇస్తే ఇప్పుడున్న పథకాలు రద్దు చేస్తారని అన్నారు. సంక్షేమ పథకాలే ప్రజలకు అన్ని విధాలుగా ఆసరాగా ఉంటాయన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు బల్ల ప్రసన్నకుమారి, దొండపాటి అన్నపూర్ణమ్మ, మట్టా శైలజ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చిన్నరాజా, పార్టీ నాయకులు కేఎస్ఎన్ రాజు, మంగెన సింహాద్రి, రాపాక వెంకట్రామ్, పాటి శివ, కంచర్ల శేఖర్, యెనుముల నారాయణస్వామి పాల్గొన్నారు.

సీఎం జగన్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఆర్ఎంసీ గ్రౌండ్ ఆవరణను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే నెల మూడో తేదీన కాకినాడ రానున్న సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లను కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు గురువారం పర్యవేక్షించారు. ఆర్ఎంసీ గ్రౌండ్ ఆవరణను అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా అక్కడ చేపట్టాల్సిన పనులపై అధికారులకు సూచనలు ఇచ్చారు. సీఎం పాల్గొనే బహిరంగ సభా స్థలి వద్ద చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఆ ప్రాంతంలో కార్పొరేషన్ పరంగా చేపట్టాల్సిన పారిశుధ్యం, ఇతర పనులపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ నాగనరసింహారావు మాట్లాడుతూ సామాజిక పింఛన్ సొమ్మును రూ.2,750 నుంచి రూ.3,000కు పెంపదల చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కాకినాడ నుంచి ప్రారంభిస్తారన్నారు. ముత్తా గోపాలకృష్ణ వారధి, రాగిరెడ్డి కళాక్షేత్రం, స్కేటింగ్ రింక్‌లను కూడా సీఎం ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డీసీపీ హరిదాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, ఈఈ మాధవి, శానిటరీ సూపర్‌వైజర్లు జిలాని, రాంబాబు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో మరలా సీఎం జగనే

జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్



విఘ్నేశ్వరుని సన్నిధిలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తదితరులు

అయినవిల్లి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుస్తారని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. గురువారం ఆయన అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపొందాలని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత జెడ్పీ చైర్మన్‌కు ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఏ సీఎం చేయనట్టుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేశారని, అర్హులందరికీ నేరుగా లబ్ధి చేకూర్చారన్నారు. అందుకే రాష్ట్ర ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డే కావాలని కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో మొత్తం 175 సీట్లు వైఎస్సార్ సీపీకే వస్తాయన్నారు. అనంతరం పలువురు పార్టీ నాయకులు, అభిమానులు జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు జన్మదిన వేడుకలు జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

శ్రీలక్ష్మీ నృసింహుని హుండీల ఆదాయం రూ.4.54 లక్షలు

మధురపూడి: కోరుకొండలో వెలసిన స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని హుండీల లెక్కింపు గురువారం జరిగింది. దీంతో రూ.4,54,132 ఆదాయం స్వామివారికి వచ్చింది. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త ఎస్‌వీ రంగరాజు, అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు తాడి రజనీరెడ్డి, అన్నవరం దేవస్థానం ఏఈఓ ఆనందకుమార్ ఆధ్వర్యంలో లెక్కింపు జరిగింది. దేవస్థానంలో కొండపైన, కింద 11 హుండీలున్నాయి. వీటన్నింటినీ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ లెక్కించారు. అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ కిషోర్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి, కేతినీడి అశోక్, ఉప్పలపాటి వీరాస్వామి పాల్గొన్నారు.

6వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య



దీవెన (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఏరుపల్లి శివారు రామారావుపేటకు చెందిన 6వ తరగతి చదువుతున్న 11 ఏళ్ల బాలిక సింగం దీవెన గురువారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందింది. ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలిక తమ ఇంట్లో ఉన్న డబ్బు తీసుకుంది. ఇది చూసిన ఆమె తమ్ముడు, అక్కలు విషయం తండ్రికి చెబుతామని తెలపడంతో ఆమె భయపడి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్ర తెలిపారు.

'నన్నయ'లో జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

లైంగిక వేధింపులే కారణం



నిందితుడు గౌతంనాయుడు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జొన్నకూటి గౌతంనాయుడును వీసీ ఆచార్య కె.పద్మరాజు సస్పెండ్ చేశారు. యూనివర్సిటీలోనే పనిచేస్తున్న ఒక మహిళను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడంటూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై అతనిని అరెస్టు చేసి, రిమాండ్‌కి పంపించారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీలో రెగ్యులర్ ఉద్యోగి అయిన అతనిని బుధవారం సస్పెండ్ చేశారు. సైన్స్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గౌతంనాయుడు ఏడాది క్రితం వరకు ఎగ్జామ్స్ విభాగంలో పనిచేసేవాడు. యూనివర్సిటీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసే స్వీపర్స్ ఉదయాన్నే 8 గంటలకు వచ్చి, గదులను తుడుస్తుంటారు. ఆ విధంగా విధులు నిర్వర్తిస్తున్న ఒక వివాహిత అయిన స్వీపర్‌పై కన్నేసిన గౌతంనాయుడు ఒకరోజు ఉదయం 8 గంటలకే చేరుకున్నాడు. ఆమె లోనికి వచ్చి గదిని తుడుస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చి తలుపులు వేసి, అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తాను రెగ్యులర్ ఉద్యోగినని, అరచినా, ఎవరికైనా చెప్పినా నీ ఉద్యోగమే పోతుందని బెదిరించాడు. ఆ బెదిరింపులకు తలొంచిన ఆమెతో ఏడాది కాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 5న ఆరోగ్యం బాగోలేదని ఆమె విధులకు రాలేదు. దీంతో లాలాచెరువులో ఉండే ఆమె ఇంటికే నేరుగా వెళ్లి, తన ఆరోగ్యం బాగోలేదని వారిస్తున్నా వినకుండా మరోసారి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. జరిగిన సంఘటనలపై ఆమె తన భర్త సహకారంతో నవంబర్ 27న రాజానగరం పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసింది. రాజానగరం పోలీసులు ఈ కేసును రాజమహేంద్రవరం దిశ పోలీసు స్టేషన్‌కు బదలాయించారు. పరారీలో ఉన్న నిందితుడిని ఈనెల 17న తాడేపల్లిగూడెంలో అరెస్టు చేసి, రిమాండ్‌కి పంపించారు. దీంతో అతనిని సస్పెండ్ చేశారు. కాగా ఈ విషయమై వీసీ ఆచార్య కె. పద్మరాజును వివరణ కోరగా సస్పెండ్ చేసిన మాట వాస్తవమేనన్నారు.

నల్లవంతెన- నడిపూడి బైపాస్ రోడ్డులో పోలీసుల గస్తీ



బైపాస్ రోడ్డులో గస్తీ నిర్వహిస్తున్న ఎస్సై పరదేశి, సిబ్బంది

అమలాపురం టౌన్: అమలాపురం నల్లవంతెన నుంచి నడిపూడి లాకుల వద్దకు ఇటీవల నిర్మించిన బైపాస్ రోడ్డులోని నిర్జన ప్రదేశాల్లో కొందరు దుండగులు దోపిడీకి ప్రయత్నిస్తున్నారన్న సమాచారంపై డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ స్పందించి ఆ రోడ్డులో పోలీసు గస్తీ ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఈ రోడ్డులో కుమ్మరి కాల్వపై ఇటీవల నిర్మించిన వంతెన వద్ద అర్ధరాత్రి దాటిన తర్వాత దుండుగలు మాటు వేసి అటుగా మోటారు సైకిళ్లపై వెళ్లే వారిని అటకాయిస్తున్నారని సోషల్ మీడియాలో ఓ బాధితుడు పెట్టిన పోస్టింగ్‌తో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. డీఎస్పీ ఆదేశాలతో అమలాపురం తాలూకా ఎస్సై ఎ.పరదేశి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బుధవారం అర్ధరాత్రి సమయంలో ఆ బైపాస్ రోడ్డులో గస్తీ నిర్వహించారు. ఈ గస్తీ రోజూ రాత్రి సమయాల్లో కొనసాగుతుందన్నారు. అయితే ఆ బైపాస్ రోడ్డులో దుండగులు దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్న సమాచారంపై కూడా విచారణ చేస్తున్నామని డీఎస్పీ అంబికాప్రసాద్ తెలిపారు. బాధితులు ఎవరైనా ఉంటే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఈ ధోరణి ప్రభుత్వ విద్యకు ప్రమాదం



ఎస్ఎఫ్ఐ జ్ఞాపికలను అతిథులకు అందజేస్తున్న దృశ్యం


కాకినాడ సిటీ: విద్యారంగంలో వినాశకర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, ఇది రాబోయే రోజుల్లో ప్రభుత్వ విద్యకు ప్రమాదకరమని కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున ప్రైవేట్ యూనివర్సిటీలు, కాలేజీలు, పాఠశాలలు విచ్చలవిడిగా వచ్చాయన్నారు. కొఠారి కమిషన్ ప్రభుత్వ రంగంలోనే విద్య కొనసాగాలని సూచించిందన్నారు. మోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని కూడా నాశనం చేస్తోందన్నారు. కాషాయీకరణ, మతతత్వం పెరుగుతుండడం ప్రమాదకరమన్నారు. జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ పోరాటాలు ఆమోదయోగ్యంగా ఉంటాయన్నారు. ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు మాట్లాతూ ఎస్ఎఫ్ఐలోకి కొత్తగా వచ్చినవారు తమ పాత నడవడికను, పద్ధతులను మార్చుకోవాలన్నారు. జేఎన్‌టీయూకే స్పోర్ట్స్ డైరెక్టర్ శ్యామ్, నాయకులు టి.రాజా పాల్గొన్నారు.

కూతురు ఇంటికి వెళ్లి తిరిగివస్తూ...

అమలాపురం టౌన్: నర్సాపురంలో ఉన్న కూతురింటికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో రోడ్డు దాటుతూ ఓ తల్లి వ్యాన్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. అమలాపురం వై.జంక్షన్‌లో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన వాతాడి మసేనమ్మ (55) మరణించింది. పట్టణ ఎస్సై మనోహర్ జోషి చెప్పిన వివరాల ప్రకారం... నర్సాపురంలో ఉన్న తన కూతురిని చూసి వద్దామని వెళ్లిన మసేనమ్మ తిరుగు ప్రయాణంలో వై.జంక్షన్‌కు వచ్చి సొంతూరు వెళ్లే ప్రయత్నంలో భాగంగా రోడ్డు దాటుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. కాకినాడ నుంచి అంతర్వేదికి రొయ్యల లోడ్‌తో వెళుతున్న డీసీఎం వ్యాన్ ఆమెను బలంగా ఢీ కొట్టడంతో మసేనమ్మ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. పెళ్లిళ్లు చేసింది. భర్త సొంతూరులోనే టైలరింగ్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోహర్ జోషి తెలిపారు.

రామాయణాన్ని మత గ్రంథంగా చూడవద్దు

సామవేదం షణ్ముఖశర్మ



సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహర్షి వాల్మీకి ప్రసాదించిన రామాయణం జాతిని జాగృతం చేసే ధర్మశాస్త్రం, కేవలం మతగ్రంథంగా చూడవద్దని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. గురువారం హిందు సమాజంలో ఆయన 16వ రోజు ప్రవచనంలో రామ, భరతుల సంభాషణను వివరించారు. అయోధ్యకాండలో 100వ సర్గకు 'కచ్చిత్' సర్గ అని పేరు. ఈ సర్గ రాజనీతిశాస్త్ర సారాంశం, నాగరిక ప్రపంచానికి పనికి వచ్చే సార్వజనీన, సార్వకాలీన అంశాలు ఈ సర్గలో కనపడతాయి. అన్ని ఆధునిక మేనేజ్‌మెంట్‌లకు పనికి వచ్చేది ఈ సర్గ అని సామవేదం అన్నారు. 'కచ్చిత్' అన్న పదానికి 'కదా' అని అర్థమని, తన దగ్గరకు వచ్చిన భరతుడు రాజు కనుక, రాముడు భరతునికి అనేక రాజనీతికి సంబంధించిన అంశాలను ఆదేశ పూర్వకంగా కాక, సూచనప్రాయంగా నీవు వీటిని అమలు చేస్తున్నావు 'కదా' అని ప్రశ్నిస్తాడు. యజ్ఞయాగాదుల ద్వారా దేవతలను, సకాలంలో వేతనాలు ఇచ్చి భృత్యులను, వినయంతో జ్ఞాన వయోవృద్ధులను సేవిస్తున్నావు కదా? ప్రలోభాలకు లొంగని, ఎదుటి మనిషి అంతరంగాన్ని అంచనా వేయగల మంత్రులు నీ వద్ద ఉన్నారు కదా? ముఖ్యమైన నిర్ణయాలు ఒక్కడివే తీసుకోరాదు, అలా అని అందరితో బహిరంగంగా చర్చలు చేయడం లేదు కదా? నీ రహస్య మంత్రాంగం దేశం పొలిమేరలు దాటి పోరాదు, వేలాది మూర్ఖులతో కన్నా ఒక్క విద్వాంసునితో చర్చించడం చేస్తున్నావు కదా? తక్కువ వ్యయంతో సత్వర ప్రయోజనాలు కలిగించే ప్రణాళికలు అమలు చేస్తున్నావు కదా? అపరాధం స్థాయిని పట్టి శిక్షలు ఉండాలి, కోశాగారం నింపుకోవడానికి జరిమానాలు విధించడం లేదు కదా? నీవు అధికారంతో భోగలాలసుడివి కాలేదు కదా!...ఇలా రాముడు సోదరునితో అనేక రాజనీతి అంశాలు ప్రస్తావిస్తాడు. సుమారు 70 శ్లోకాలలో రాముడు సంధించిన వందకు పైగా ప్రశ్నలు ఉన్న ఈ సర్గను ఆధునిక సమాజంలో నాయకుడిగా ఎదగాలనుకుంటున్న వారు తప్పక అధ్యయనం చేయాలని అన్నారు.

పరీక్షల షెడ్యూల్ విడుదల

ఏపీ ఓపెన్ స్కూల్ ఎంబ్లమ్

రాయవరం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం(ఓపెన్ స్కూల్) ద్వారా నిర్వహించే పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజు షెడ్యూల్‌ను ఏపీ సార్వత్రిక విద్యాపీఠం డైరెక్టర్ కె.నాగేశ్వరరావు విడుదల చేశారు. పరీక్ష ఫీజుల విధి విధానాలు, పరీక్షల షెడ్యూల్‌ను ఏపీ సార్వత్రిక విద్యాపీఠం జిల్లా కోఆర్డినేటర్ పి.సాయివెంకటరమణ తెలిపారు. పరీక్ష ఫీజును అపరాధ రుసుం లేకుండా 2024 జనవరి 5 నుంచి 19వ తేదీ లోపు చెల్లించాల్సి ఉంది. అపరాధ రుసుం లేకుండా పదవ తరగతికి ఒక సబ్జెక్టుకు రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.5, పరీక్ష ఫీజుగా రూ.95 చెల్లించాలి. ఇంటర్‌కు ఒక సబ్జెక్టుకు రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.5, పరీక్ష ఫీజుగా రూ.145 చెల్లించాల్సి ఉంది. ప్రాక్టికల్ ఒక్కో సబ్జెక్టుకు రూ.100 చెల్లించాలి. ఉత్తీర్ణత సాధించని ఇంటర్మీడియెట్ విద్యార్థులు పాసైన సబ్జెక్టుల్లో ఇంప్రూమ్‌మెంట్‌కు థియరీ ఒక్కో సబ్జెక్టుకు రూ.250, ఫెయిలైన సబ్జెక్టుకు రూ.150 వంతున ఫీజుగా చెల్లించాలి. ప్రాక్టికల్ ఒక సబ్జెక్టుకు రూ.100 చెల్లించాలి. రూ.25 అపరాధ రుసుంతో జనవరి 20 నుంచి 27వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుంతో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 4 నుంచి 9వ తేదీ వరకు తత్కాల్ రుసుంతో పదవ తరగతికి రూ.500, ఇంటర్‌కు రూ.1,000 అపరాధ రుసుంతో పాటు, ఆయా సబ్జెక్టులకు నిర్దేశిత పరీక్ష ఫీజును ఏపీ ఆన్‌లైన్, ఏపీఓఎస్ఎస్ ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి 1,269 మంది, ఇంటర్‌లో చేరేందుకు 5,077 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరంతా పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంది.

పరీక్షల షెడ్యూల్ ఇదీ

ఓపెన్ స్కూల్ పరీక్షలు మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయి. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు మార్చి 30 నుంచి ఏప్రిల్ మూడవ తేదీ వరకు జరుగనున్నాయి.

నిర్ణీత గడువులోగా..



ఓపెన్ స్కూల్ ద్వారా ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులు పరీక్ష ఫీజును నిర్ణీత గడువులోపుగా చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా గాని లేదా ఓపెన్ స్కూల్ కేంద్రాల కోఆర్డినేటర్ల వద్ద గాని పరీక్ష ఫీజును చెల్లించాలి. సందేహాలు, ఇబ్బందులు తలెత్తినా 8977645704 నంబరుకు ఫోన్ చేయవచ్చు.

– పి.సాయివెంకటరమణ, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్, అమలాపురం